# సుడిగుండాలు

కాలేజీ చదువు చదివిన కాలమంతా ఎంత హాయిగా గడిచిందో ప్రసాదరావు ఎరగడు. 'డిగ్రీ తెచ్చుకొన్నావు చాల్లే, ఇక ఉద్యోగం చూడు.' అని తండ్రి అన్నమీదట ప్రసాదరావుకు గలిగించిన ఆనందం అవగతమయింది.

నాలుగు సంవత్సరాలు! నాలుగు సంవత్సరాల స్వేచ్ఛా విహారం. ఆ జీవితంలో కృత్రిమ బాంధవ్యాలు లేవు. ఇష్టమయినవాణ్ణి హృదయానికి హత్తుకోవటమూ, లేనివాణ్ణి దూరంగా ఉంచటమూ, కోపం తెప్పించిన వాణ్ణి ఇష్టమైతే క్షమించటమూ, లేకపోతే భరతంపట్టించి మరుక్షణం అంతా మరిచిపోవటమూ.

బుద్ధి వచ్చింది లగాయతు మూసిఉన్న తలుపులన్నీ తెరిచి ఆత్మయొక్క మూల మూలకి వెలుతురూ గాలీ పోనిచ్చి, ఇష్టం వచ్చిన విషయాన్ని గురించి

ఇష్టం వచ్చినట్లు మాట్లాడి, ఎవరేమనుకుంటారో అనే భయం అవసరం లేకుండా అప్రయత్నంగా ఊరే భావాలను మురగ బెట్టకుండా....

ఎంత సుఖమయమయిన జీవితం!

మళ్ళీ ఈ ప్రపంచంలోకి— తనకన్న మువ్వయ్యేళ్ళు ముందర పుట్టానని ప్రతి క్షణమూ జ్ఞాపకం చేసే తండ్రి దగ్గరికి - తొమ్మిది నెల్లు మోసి కని పెంచానని మాతృ నియంతృత్వం చేసే తల్లి దగ్గిరికి - నా భార్య తమ్ముడివి, నాగులాముఖి అని జ్ఞాపకం చేసే బావగారి దగ్గిరికి – తను మనస్సువిచ్చి మాట్లాడినా, గట్టిగా నవ్వినా అనుమానించే అర్థమృతుల మధ్యకు- కాస్త తెలివిగా మాట్లాడితే బియ్యే అనీ, ఆడదానివంక పొరపాటున చూస్తే వయసులో ఉన్న బ్రహ్మచారి అనీ అనుమానించే సంఘంలోకి....

సుడిగుండాల్లోకి....

ప్రసాదరావుకు పారిపోదా మనిపించింది. పలాని చోటికనిలేదు. ఇక్కడ లేకుండా ఎక్కడికైనాసరే, తను ఏం చేసినా గమనించని వారుండే చోటుకి.

"నేను పట్నం పోతున్నాను" అన్నాడు ప్రసాదరావు.

"ఏమీ అక్కర్లేదు. ఇక్కడ కూచుని చాతయిందేదో చెయ్యి, పట్నం పోయినంత ఫలం!" అన్నాడు తండ్రి.

"నేను పట్నంపోనా, వద్దా అని అడగలేదు. పోతున్నానని చెప్పాను." అన్నాడు ప్రసాదరావు. ఆటువంటి సంభాషణ తను ఎక్కడ చదివాడో జ్ఞాపకం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ.

తీరా పెట్టె చంకన పెట్టుకుని రైలుకు బయలుదేరిన తరువాత, తను చాలా పిరికివాడని తెలిసివచ్చింది. కాకపోతే, తనలో అంత కల్లోలమెందుకూ? తన గుండె కంత అదరెందుకూ? ఏవో కనపడని బలమైన గొలుసులను తెంచ టానికి ప్రయత్నిస్తూ, తన ఆత్మ శ్రమపడుతున్నదని తెలుసుకున్నాడు ప్రసాద రావు.

ప్రసాదరావు ఇంకొకందుక్కూడా ఆశ్చర్యపడ్డాడు. మొదటిసారి పట్నం పోదామనుకున్నప్పుడా ఆలోచన వెర్రిగా కనబడ్డది. పట్నంలో ఎక్కడ దిగాలి? ఏం చెయ్యాలి? ఎవరిని కలుసుకోవాలి? అక్కడ ఎంతకాలం ఉండగలుగుతాడు? ఈ విధంగా మనసు ఎటు తిరిగినా అగాధాలే కనపడినై. ఏమయినా పట్నం వెళ్ళి తీరాలని తీర్మానం చేసుకున్న తరవాత ఒక్కొ ఉపాయమే తోచింది. దేనికన్నా సంకల్పం ఉండాలి.

పట్నంలో లా చదువుతున్నాడు తన బియ్యే స్నేహితుడు భాస్కరం.

పట్నం రమ్మంటావా అని వాడికి ఉత్తరం రాస్తే వాడు తిరుగు టపాలో వెంటనే రా అని రాశాడు. వాడు విడిగా గది తీసుకుని ఉంటున్నాడు.

పాపం, రైలు దగ్గిరికూడా వచ్చాడు భాస్కరం. వాణ్ని చూడగానే మళ్ళీ తను కాలేజీ జీవితంలో పడ్డట్టే అయింది ప్రసాదుకు. ఇద్దరూ కలిసి బస్సెక్కి మైలాపూరు వెళ్ళారు. కపాలేశ్వరస్వామి కోవెల సమీపంలో భాస్కరంగాడి గది.

"హోటలునించి కారీయరు తెప్పిస్తాం. చవుకలో పోతుంది!" అన్నాడు భాస్కరం.

వాడు చాలా విషయాల్లో మారిపోయినాడు. బియ్యే చదివేటప్పుడు కూడా అమాయకుడల్లే ఉండేవాడు. ఇప్పుడు చాలా నేర్చాడు. ముఖ్యంగా డబ్బు తగలెయ్యటం. అందుకనే ప్రతిదానికీ తను ఎంత ఆదా చేస్తున్నదీ లెక్క చెబుతాడు గాని ఖర్చు లెక్క చెప్పడు.

తను ఏదైనా ఉద్యోగం త్వరలో చూడాలి. బస్సు కండక్టరూ, ట్రాము కండక్టరూ— ఇటువంటి ఉద్యోగాలు సులభంగా రావచ్చు. ఏం చెయ్యాలో? బ్రాహ్మల కిస్తారో ఇవ్వరో? కనీసం అరవం రావాలి. ఎన్న సావడింగళా? లాభం లేదు. తన కరవం రాదు; ఎన్నడికీ రాదు.

ఈ భాస్కరంగా డెవతెనో పట్టాడు. కనీసం పట్టటానికి చూస్తున్నాడు. సాయంకాలం ఎటో పోతాడు. తను వెంట రావటం వాడి కిష్టం లేదు. పైకి అనడుగాని తెలుస్తూనే ఉంది.

"నాకేమన్నా ఉత్తరాలు వస్తే చించి చూసేవురో? జాగర్తగా ఉంచు!"

నవ్వుతూనే! లోపల వాడి బెదురు తనకు కనిపించటం లేదని, పిచ్చి వెధవ!

సాయంకాలం పూట ఇంటో కూర్చుంటే తోచదు. భాస్కరం దగ్గిర మేరియామాంకు తప్ప వేరే పుస్తకం లేదు.

దీపాలు పెట్టేవేళ వచ్చింది, దూకుడుగా తలుపు తోసుకుని కాళికా శక్తల్లే.

"ఏదండీ, భాస్కర్రావుండేది ఇక్కడ కాదూ?"

"అవును. ప్రస్తుతం ఇంటోలేడు. ఎనిమిది తొమ్మిదింటిదాకా రాడు."

"బతికిపోయినాడు. నేను వచ్చానని చెప్పండి. ఇంకోసారి అటువంటి ఉత్తరం రాస్తే పీప్పగల గొట్టిస్తానని చెప్పండి. ఎవరనుకున్నాడో?"

వెళ్ళిపోయింది.

అందమైన మనిషి. అంత కోపంలో కూడా అందం నిలబెట్టుకున్నది. చాలా కష్టం. కాస్త కోపం వస్తే వికారంగా అయిపోతారు చాలామంది.

ఆమె ఎవరో తనకు తెలుసుననుకున్నది. ఏ ఉత్తరమో అది కూడా తెలుసు ననుకున్నది. తనూ భాస్కరమూ కలిసి నాటకం ఆడుతున్నారను కున్నది.

భాస్కరంగా డా పిల్లకేం ఉత్తరం రాసి ఉంటాడు?

జరిగిందంతా విని భాస్కరంగాడు రహస్యం బయట పెట్టేశాడు. ఆ పిల్ల పేరు జానకి. భోగం వాళ్ళపిల్ల. ఒంగోలు తాలూకా. వాళ్ళమ్మ ఇంకా వృత్తిలో ఉంది. ఈ పిల్లను పినతల్లి మొగుడు పెంచుతున్నాడు. చదివిస్తున్నాడు. పినతల్లి వృత్తిలో ప్రవేశించలేదు, పెళ్ళాడింది. అదృష్టవంతురాలు. మొగుడు ప్లీడరు. నెలకు హీనంగా నాలుగు వందలు సంపాదిస్తాడు. మైలాపూరులో పెద్ద మేడ. త్యాగరాయ నగరంలో ఒక ఇల్లు కట్టించి అద్దెకిచ్చాడు.

"జానకికి చాలా అహంకారం. పాతివ్రత్యం నటించబోతుంది. మగ వాళ్ళంటే నిర్లక్ష్యం. తన మీద ప్రేమ ఉన్నవాళ్ళంటే మరీ దాబు చేస్తుంది. పాసు ...!....ఏమైనా దాన్ని ప్రేమించకుండా ఉండలేను. పెళ్ళాడతానన్నాను. ఎంతచెడ్డా బ్రాహ్మణ ముండాకొడుకును గదా. ఎంత త్యాగం చేస్తున్నానో గ్రహించదు. థాంక్సులేకపోగా, ఏమిటో దాబుచేస్తుంది, పాసు—

'తన్ను పెళ్ళాడటానికి కొండమీదికోతి దిగివస్తుందనుకుంటున్నది. అసలు తనకు పెళ్ళికాదేమోననే ఆలోచనలేదు. తన తల్లి మాదిరిగా ఒళ్ళమ్ముకు బతకాలిసొస్తుందనే భయంలేదు....'

అట్లా మాట్లాడతాడు భాస్కరం. ఆ మనిషిని ప్రేమించాననటూ! ప్రత్యక్షంగా చూస్తే ప్రేమలింత నమ్మశక్యంగాకుండా ఉంటై. కనకనే కొందరు నాస్తికులు ప్రేమను నమ్మరు. తనమీద అసహ్యం వున్న మనిషిని ప్రేమించటం తనకు సాధ్యమవుతుందా? అసంభవం....

భాస్కరం ఇంకా ఆమెను – ఆ జానకిని – వదిలినట్టులేదు. వాడి మనస్సు చాలా అనారోగ్యంగా వుంది. తను గదిలో వున్నందుకు విసుక్కుంటు న్నాడేమో! అటువంటప్పుడు ఎవరికన్నా ఒంటరిగా వుండాలని వుంటుంది....తన కిజన్మకు వుద్యోగం దొరకదు. పాతిక రూపాయలతోకూడా పట్టణంలో బతికి వుండవచ్చు. పాతికేమిటి! పది రూపాయిలమీద కుటుంబా లీదేవాళ్ళుందరూ? దేనికన్నా సంకల్పం ఉండాలి.

* * *

చెప్పకుండా చెందకుండా భాస్కరంగా డెంత సాహసాని కొడిగట్టాడూ! వాడా మందెట్లా సంపాదించాడో!

"నేను భోంచెయ్యను. ఇవాళ్టికి నువు హోటలుకు వెళ్ళి భోంచేసిరా!"

వాడా మాట అనేటప్పు డాపొట్లం వాడి జేబులో వుండి వుంటుంది. తను వెళ్ళి తిరిగివచ్చేటప్పటికి అరగంటకూడా అయి వుండదు. ఈ లోపల తన ప్రాణం తను తీసుకున్నాడు.

ఆత్మహత్య! తమలో ఏదో ప్రయోజకత్వం వుందని ఇంకేవిధంగానూ చూపలేనప్పుడు ఆత్మహత్య చేసుకుంటారేమో! ఒక్క పావుగంటలో చుట్టు ప్రక్కలంతా ఎంత అల్లరి! జనం ఎట్లా మూగారు! అంతమందిలోనూ తనని గమనించే వాడులేడు.

ఇదే అపరాధ పరిశోధకవలల్లో అయితే ఆ హత్య తనకు చుట్టుకొని వుండునేమో! మోటివ్ - ఇద్దరు కలిసి జానకి అనే బోగంపిల్లను ప్రేమించారు. పోట్లాడుకున్నారు. అందులో ప్రసాదనేవాడు భాస్కరానికి - తనకు ఆశ్రయం ఇచ్చిన భాస్కరానికి మందుపెట్టి చంపేశాడు. తాను హత్య చెయ్యలేదని నిరూపించటానికి పత్తేదారు అరవిందం వస్తాడు. నోట్లో చుట్ట. పుగాకు వాసన.

కాని — అన్నట్టు వాడు రాసిపెట్టిన ఉత్తరం. ఆ అమ్మాయికి! ఆ జానకికి!

ఎంత అన్యాయం - ఆ పిల్లపేరు ఇందులోకి ఈడ్చుకురావటం!

"జానకీ,

నేను నావవిత్ర ప్రేమతో నిన్నిక బాధించను కాని నిన్ను ముందు ముందు ప్రేమించదలిచినవాళ్ళు నా గతి స్మరించి అయినా బుద్ధి తెచ్చుకుంటారు గాక. నా జీవితంలో సమస్తమూ హరించినందుకు నేను నీకు కృతజ్ఞుణ్ణి.

భాస్కరం."

ఎంత ఛండాలపు వుత్తరం! ఎంత అక్కసు! ఆ జానకిమీద ఎంత వగ! పైగా ఆ వుత్తరం చూసి నలుగురూ వాణ్ణి పాపం అనటం. గుడ్డి ముండాకొడుకులు. వీళ్ళను వంచించటం ఎంత సులభం!

తను వెళ్ళి భాస్కరం తరపున ఆ పిల్లకు - ఆ జానకికి — క్షమావణ ఇవ్వద్దూ! తప్పక ఇవ్వాలి! ఆమెతో సానుమూతి చూపేవా దొక్కడుండడు. పాపం! ఈ వెధవను పెళ్ళాడనందుకు ఆమె కిదా శిక్ష! వెళ్ళి ఆమెతో రెండు మంచిమాటలనివస్తే తప్పేమిటి?

భాస్కరం చాలా బాకీలు చేశాడు. రెండునెల్ల గది అద్దె ఇవ్వాలి. కాఫీ

హోటల్లో బాకీ, హోటల్లో బాకీ, సిగరెట్ల దుకాణంలో బాకీ. ఇంకా ఇతర చేబదుళ్ళు.

వీటన్నిటికీ తనే పూచీపడాలి. తప్పదు. కాలం! భాస్కరంమీద పడితిని-ఇరవై రోజులు. రోజుకు అయిదు రూపాయలు వడ్డది. అయినా, తప్పదు. ఓ వందరూపాయలు, నూటయాభై రూపాయలు పంపమని ఏ స్నేహితులకైనా రాసి చూడాలి. ముందు గది ఖాళీ చెయ్యాలి.

తనని చూడగానే ఆ ప్లీడరు - జానకి పినతల్లి మొగుడు-"ఎవరు మీరు?" అని వురిమాడు. ఫలానావాడి స్నేహితుడని చెప్పగానే "ఇంకేమైనా వుత్తరాలు రాశాడా?" అన్నాడు.

పాపం, వాళ్ళకు కష్టంగా వుండదా?

"మీ అమ్మాయికి మా భాస్కరం చాలా ద్రోహంచేశాడు. "మీ మనస్సెట్లా వుండేదీ నే నూహించగలను. వాడు చేసినపని నేను ఎన్నటికీ క్షమించలేను. మీ అమ్మాయికి క్షమాపణ చెప్పిపోదామని వచ్చాను!"

"ఏమీ అవసరంలేదు. మీరు వచ్చిన దారినే వెంచెయ్యండి."

తను విధిలేక వెంచేశాడు.

తలుపు చప్పుడు, ఇంకా ఇంతకంటే ఆలస్యంగా వచ్చేవాడు భాస్కరం. ఎవరో దబ్బుకోసమై వుంటారు.

ఆ పిల్ల! ఆ-జానకి! ఎంత మారిపోయింది. పిల్లి కూనల్లే.......

"పొద్దున మీరు మా యింటికి రావటం చూశాను...."

సరిగా మాట్లాడలేకుండా వుంది. ఏడవదు గదా కొంపతీసి!

"మీరు మా బాబాయితో అన్నమాటలు విన్నాను."

ఏడుస్తుంది! ఇంకొక్క పావునిమిషంకంటె ఆపుకోలేదు.

"మీరెవరో నే నెరగను. కాని మీరు చూపించినంత జాలి నా మీద ఎవరూ చూపించలేదు...."

అయిపోయింది. కట్ట తెగింది. పరాయి ఆడదాన్ని ముట్టుకొని ఓదార్చరాదు. ఆమె మొహంమీద మొహం పెట్టరాదు. మంచిపిల్ల! ఎట్లాగో ఆత్మవికాసం సంపాదించింది. లేకపోతే తను అనదలచిన మాటలకు అంతగా కృతజ్ఞత చూపదు. వాళ్ళ బాబాయి - ఆ ప్లీడరు చూడరాదూ? ఎంత కర్కశంగా మాట్లాడాడో!

"కిందటిసారి మిమ్మల్ని చూసినప్పుడు చాలా మొరటుగా మాట్లాడాను. క్షమించండి. మీ స్నేహితుడి మీద కోపం మీమీద చూపించాను."

"నే నట్లా అనుకోలేదు! నిజం!" అని ప్రారంభించాడు తను.

"మీ మీద కాకపోతే మీ ఎదట చూపాను. అదికూడా తప్పే."

కాదంటే బాధపడుతుంది. మాట్లాడనిస్తేసరి.

చిత్రం! ఈ జానకి తన మనస్సులో వున్నది చెప్పగలదు. మాట్లాడగలదు! అందరూ అట్లా మాట్లాడలేరు. అధమం తనకు దొరికే భార్య మూగదవుతుంది. ఆవిడకు తనని సాధించేవరకే మాటలువస్తై. ఆపైన రావు. తన జాతకమే అంత. ఈ జానకికి అన్నివిధాలా భాస్కరంవంటి వాడే మొగుడవుతాడు. ఆమెను ప్రేమిస్తాడు, ద్వేషిస్తాడు, అగౌరవంగా మాట్లాడతాడు. కాని ఆమెను వదిలిపెట్టడు. చచ్చి అయినా సాధిస్తాడు.

తను పెళ్ళాడితే జానకిని పెళ్ళాడవచ్చును. అడిగితే జానకి ఒప్పుకోవచ్చును. కాని, తను అడగడు, ఈమె ఇప్పుడు వెళ్ళిపోయి మళ్ళీ కనిపించదు.

"వెళ్ళివస్తాను! దయ వుంచండి!"

*　　　*　　　*

ప్రసాదరావు లేచివెళ్ళి తలుపుతీశాడు. భాస్కరం దిగ్విజయం చేసి వచ్చిన వాడల్లే లోపలికి వచ్చాడు.

"ఇవాళ రెండు విజయాలు! నీకు వుద్యోగం దొరకబోతున్నది. అనుకోకుండా వెంకటప్పయ్య కనిపించి, వాళ్ళ ఆఫీసులో ఖాళీ వుందన్నాడు. తన చేతిలో వున్నవనే, ఎరిగినవాళ్ళుంటే చెప్పమన్నాడు. నీ పేరు చెప్పేశాను."

"ఇంకో విజయం ఏమిటి?"

"అది లేదూ, ఆ పాసు—! దాన్ని బుట్టలో వేసేశాను."

దేనికన్నా సంకల్పం వుండాలి!....

సుడిగుండాలు....

[ముద్రణ : మే 1947, మొండివాడు కథల సంపుటి,
రెండవ ముద్రణ : యువ బుక్స్, హైదరాబాదు]